
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం ৷ 26 ৷ జూలై ৷ 2025



6,799 క్యూసెక్కుల వరద

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 28.222 టీఎంసీలు ఉన్నాయి. 6,799 క్యూసెక్కుల వరద వస్తోంది. దిగువకు 2,320 క్యూసెక్కులను వదులుతున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.1,01,600
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,183
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,458
నవర (8 గ్రాములు)	రూ.75,664

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.3 /27.4

జిల్లాలో శనివారం ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుందని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. శుక్రవారం గాలిలో తేమ 61 శాతం ఉంది.

న్యూస్‌రీల్

ప్రసన్నకు విష్ణు పరామర్శ



ప్రసన్నకుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులతో మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, కుటుంబీకులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం పరామర్శించారు. ప్రసన్న ఇంటిపై టీడీపీ మూకలు సాగించిన దాడి నేపథ్యంలో నెల్లూరులోని ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసానికి చేరుకుని విచారం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో హుందాతనం ఉండాలని, కక్ష పూరితంగా వ్యవహరించడం సరి కాదన్నారు. రాజకీయంగా విమర్శలకు ప్రతి విమర్శల రూపం ఉండాలే కానీ, ఇళ్లపై పడి ధ్వంసం చేయడం మంచి పద్ధతి కాదన్నారు.

పంద్రాగస్టు వేడుకలకు నిధుల విడుదల

నెల్లూరు (టౌన్): జిల్లాలో పీఎంశ్రీ కింద ఎంపికైన పాఠశాలల్లో ఆగస్టు 15 సందర్భంగా వేడుకలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. జిల్లాలో 46 పీఎంశ్రీ పాఠశాలలు ఉన్నాయి. ఒక్కో పాఠశాలల్లో వేడుకలకు రూ.25 వేలు నిధులను విడుదల చేశారు. జెండా ఆవిష్కరణ, సౌండ్ సిస్టంకు రూ.2 వేలు, పాఠశాల స్థాయిలో ఆటల పోటీల నిర్వహణకు రూ.5 వేలు, స్కిట్స్ హిస్టారికల్ ఈవెంట్స్, బ్యానర్స్, లైటింగ్‌కు రూ.3 వేలు, ఎస్‌ఏ రైటింగ్, క్విజ్ కాంపిటేషన్ బహుమతుల కోసం రూ.5 వేలు, పెయింటింగ్, పోస్టర్ మేకింగ్, స్నాక్స్‌కు రూ.10 వేలు ఖర్చు చేయాలని సూచించారు. జిల్లాలో 46 పాఠశాలలకు కలిపి మొత్తం రూ.11.50 లక్షలు నిధులు విడుదల అయ్యాయి.

ప్రతిష్టాత్మకంగా ఉల్లాస్- అక్షరాంధ్ర

- కలెక్టర్ ఆనంద్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు రూపొందించిన ఉల్లాస్-అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని వయోజన, విద్య, రెవెన్యూ, మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2029 నాటికి రాష్ట్రంలో 100 శాతం వయోజన ప్రాథమిక అక్షరాస్యత సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అక్షర ఆంధ్ర అనే ప్రత్యేక కార్యక్రమం రూపొందించిందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 19,178 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దామన్నారు. 2025–26 సంవత్సరానికి 1,08,680 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు బోధనా తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. మొదట కోవూరు నియోజకవర్గంలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కోరారు. 15 నుంచి 59 సంవత్సరాల్లోపు మహిళలు, పురుషులు, కూలీలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చదవడం, రాయడం, ప్రాథమిక గణితం, డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత వంటి అంశాలపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ లక్ష్య సాధనలో ఇతర శాఖలకు చెందిన అధికారులందరూ పరస్పర సమన్వయంతో పని చేయాలన్నారు. స్వచ్ఛందంగా బోధించేందుకు ముందుకు వచ్చే ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారికి తగిన శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఆగస్టు 7న అక్షరాస్యత కేంద్రాలు ప్రారంభమై ఫిబ్రవరి 2026న బోధనా తరగతులు ముగించాలని కోరారు. మార్చిలో అక్షరాస్యత పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో వయోజన విద్యాశాఖ నోడల్ అధికారి మస్తాన్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, మెప్మా పీడీ లీలారాణి, డ్వామా పీడీ గంగాభవాని, డీఈఓ బాలాజీరావు, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, కోవూరు నియోజకవర్గ మండలా అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

కావలి మనీ స్కామ్
తుట్టె కదిలింది

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి భరోసాతో కదలిక

- ఒక్కొక్కరుగా బయటకు వస్తున్న బాధితులు
- రూ. 91 లక్షలు కట్టి మోసపోయానని మాజీ ఎమ్మెల్యేకు ఓ బాధితుడి ఫిర్యాదు
- హెల్ప్ డెస్క్ నంబరు 97048 31113, ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు



మనీస్కాంలో మోసపోయామని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న బాధితుడు బాలయ్య

కావలి (జలదంకి): కావలి మనీ స్కామ్‌పై మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆరోపణల నేపథ్యంలో అక్రమార్కుల తుట్టె కదలింది. ఆయన ఆరోపించిన 24 గంటల్లోనే బాధితుల నుంచి స్పందన వచ్చింది. బాధితులకు అండగా ఉంటానని ఆయన ఇచ్చిన భరోసాతోపాటు 9704831113 సెల్ నంబరుతో హెల్ప్ డెస్క్, ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడంతో ఒక్కొక్కరుగా బాధితులు బయటకు వస్తున్నారు. శుక్రవారం కావలి పట్టణం వెంగళరావునగర్ 25వ వార్డుకు చెందిన పసుపులేటి బాలయ్య తన బంధువులు 13 మంది కలిసి రూ.91 లక్షలు మనీస్కామ్ సూత్రధారి సుభానీకి కట్టి మోసపోయామని ప్రతాప్ కుమార్‌రెడ్డికి వినతి అందించాడు. బాధితుడు బాలయ్య మాట్లాడుతూ తనతో పాటు బంధువులు 13 మంది అందరం ఆశతో స్థలం అమ్ముకుని, బంగారు కుదువ పెట్టి ఒకేసారి రూ. 91 లక్షలు కట్టామన్నారు. మేము కట్టిన రెండు నెలలకే మనీ ట్రేడింగ్ సంస్థను మూసివేశారన్నారు. గతంలో కావలి డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశామన్నారు. దానికి సంబంధించి ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదన్నారు. మాకు జరిగిన అన్యాయంపై డిప్యూటీ సీఎం, సీఎంకు కూడా ఫిర్యాదు చేశామన్నారు. కావలి ఎమ్మెల్యే వద్దకు పలుమార్లు వెళ్లి తమ గోడు తెలిపామన్నారు. అయినా అతీగతీ లేదన్నారు. దీంతో మా బాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నామన్నారు. మీరు ఇచ్చిన భరోసాతో న్యాయం జరుగుతుందని భావించి వచ్చామన్నారు.

ప్రతి బాధితుడికి న్యాయం జరిగే వరకు పోరాడుతా: ప్రతాప్‌కుమార్‌రెడ్డి

ఈ మనీస్కాంలో ఎంతో మంది పేదలు, ఉద్యోగులు మోసపోయారని, వారికి న్యాయం చేయడంలో ప్రభుత్వం, పోలీసులు విఫలం అయ్యారని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. మనీస్కామ్‌లో ఎమ్మెల్యేతోపాటు పోలీసులు ముడుపులు తీసుకుని కేసును నీరుగార్చిన విషయం అర్థమవుతుందన్నారు. మనీస్కామ్‌లో నగదు కట్టి మోసపోయిన ప్రతి ఒక్కరికీ నగదు అందించేందుకు వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు. కార్యాలయంలో బాధితులు వినతులు ఇచ్చేందుకు కౌంటర్లు, ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. బాధితులు ఎవరికీ భయపడకుండా ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పందిటి కామరాజు, పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, రూరల్ అధ్యక్షుడు వాయిల తిరుపతి, నాయకులు నెల్లూరు వెంకటేశ్వర్‌రెడ్డి, గంధం ప్రసన్నాంజనేయులు, కుందుర్తి కామయ్య, దామిశెట్టి సుధీర్‌నాయుడు, ఏగూరి పుల్లయ్య, కొండూరు శ్రీనివాసులు, పరుసు మాల్యాద్రి, దయాకర్‌రెడ్డి, పార్థు, ఆర్‌కే కృష్టారెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ధిక్కారంతో ముందుకెళ్తే
దిక్కు లేకుండా చేస్తాం

- నమ్మి ఓట్లు వేస్తే గ్రామాలే లేకుండా చేస్తారా
- పరిశ్రమలు రావాలే కానీ పచ్చని గ్రామాలు, పొలాల్లో కాదు
- కరేడు రైతులకు వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు
- పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ జూపూడి
- కరేడు పంచాయతీ రామకృష్ణాపురం, ఉప్పరపాళెం గ్రామాల్లో పర్యటన



మాట్లాడుతున్న జూపూడి ప్రభాకరరావు

ఉలవపాడు: 'కూటమి ప్రభుత్వం ధిక్కారంతో ముందుకెళ్తే కరేడు భూ సేకరణలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేరు. దిక్కు లేకుండా చేస్తాం' అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకరరావు హెచ్చరించారు. శుక్రవారం కరేడు పంచాయతీలో భూములతో పాటు గృహాలు కూడా కోల్పోతున్న రామకృష్ణాపురం, ఉప్పరపాళెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ పుట్టిన గడ్డకు ప్రజలకు ఉండే సంబంధం వెలకట్టలేనిది. డబ్బులతో విడదీయాలనుకుంటే కుదరదన్నారు. ప్రజలను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఊర్లకు ఊర్లు ఖాళీ చేయించడం ఏంటని ప్రశ్నించారు. జగనన్న కరేడు రైతులకు అండగా ఉంటారని, ఆయన ఆదేశాల మేరకు తానిక్కడకు వచ్చినట్లు తెలిపారు.

మీ ప్రభుత్వాన్ని బుల్‌డోజర్‌తో తప్పిస్తారు

మీరు పోలీసులను పెట్టి బలవంతంగా బుల్‌డోజర్‌తో ఆక్రమించాలని చూస్తే మీ ప్రభుత్వాన్ని అదే బుల్‌డోజర్‌తో తప్పిస్తారని జూపూడి హెచ్చరించారు. అమరావతిలో లక్షల ఎకరాలు భూసేకరణ చేస్తూ రైతులను మోసం చేస్తున్నారన్నారు. పరిశ్రమలకు తాము వ్యతిరేకం కాదని, ఖాళీ, బీడు భూముల్లో వీటిని ఏర్పాటు చేయాలన్నారు. చంద్రబాబు కుప్పంలో ప్రతి ఇంటి మీద సోలార్ బిగిస్తున్నాడు. అలాంటి చోట ఏర్పాటు చేయొచ్చు కదా అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంటలు పండే భూములను, గ్రామాలను పరిశ్రమలకు సేకరించడం వ్యతిరేకమన్నారు. గ్రామాలను తీసుకోకూడదని జగన్ చెప్పారన్నారు. రాష్ట్రం మొత్తం కరేడు వైపు చూస్తోందన్నారు. ఉద్యమంలోకి గాలోడు పాత్రలతో కొందరు విచ్ఛిన్నం చేయడానికి వస్తారని వారిని గమనించాలన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబు ఎవరి పక్షమో తేల్చుకోవాలన్నారు. కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు, వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు నన్నం పోతురాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ధనకోటేశ్వరరావు, కరేడు గ్రామ అధ్యక్షులు సీతారామిరెడ్డి, కరేడు రైతు ఉద్యమ నాయకులు మిరియం శ్రీనివాసులు, మాజీ సర్పంచ్‌లు కృష్ణారావు, సుబ్బారావు, నియోజకవర్గ ఉద్యోగ, పెన్షన్ వింగ్ అధ్యక్షుడు ఆదాం, వడ్డెర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ యనమల మాధవి, మాజీ ఏఎంసీ చైర్మన్ ప్రభావతి, పాకల వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షుడు కేశవరపు కృష్ణారెడ్డితోపాటు కరేడు గ్రామ రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కారుమూరి, చిత్రంలో నేతలు

అక్రమ కేసులతో డైవర్షన్ పాలిటిక్స్

- మాజీ మంత్రి కారుమూరి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వ డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మాజీ మంత్రి, పార్టీ పార్లమెంట్ రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు ఆరోపించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వెంకటగిరి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్తలు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి, కాకాణి పూజితతో కలిసి విలేకరులతో కారుమూరి శుక్రవారం మాట్లాడారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా పార్టీ పార్లమెంట్ రీజినల్ కోఆర్డినేటర్‌గా తనకు బాధ్యతలను పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అప్పగించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నమ్మకాన్ని నిలబెట్టుకొని, జిల్లాలో పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు. జిల్లాలో పార్టీలకతీతంగా నాయకులు కలిసిమెలిసి ఉండేవారని, అయితే ప్రస్తుతం పరిస్థితి దీనికి భిన్నంగా మారిందని చెప్పారు. తమ పార్టీ నేతలే లక్ష్యంగా అక్రమ కేసులను కూటమి ప్రభుత్వం బనాయిస్తూ దుర్మార్గపు చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై మోపిన అక్రమ కేసుతోనే ఈ విషయం స్పష్టమవుతోందని చెప్పారు. ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడి దుర్మార్గమని.. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజమని, అంతమాత్రాన ఇళ్లపై పడి విధ్వంసం సృష్టించడం సరికాదని హితవు పలికారు. ఈ విధమైన దాడులు సంస్కృతి నెల్లూరు జిల్లాలో ఎప్పుడూ చూడలేదన్నారు. ప్రభుత్వ పథక రచనలో భాగంగానే మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్‌కు నోటీసులిచ్చారని చెప్పారు. లిక్కర్ కేసనే అభియోగాన్ని ఎంపీ మిథున్‌రెడ్డిపై మోపి అరెస్ట్ చేశారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మద్యం దుకాణాల ద్వారా ప్రభుత్వానికి రూ.27 వేల కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వంలో మద్యం దుకాణాలను విచ్చలవిడిగా ఏర్పాటు చేసి.. లిక్కర్‌కు ప్రజలు బానిసలయ్యేలా ప్రోత్సహిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి.. డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని విమర్శించారు. ప్రశ్నించే గొంతులను నొక్కాలని యతిస్తే, వేల గొంతుకలు ప్రశ్నిస్తారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని టీడీపీకి హితవు పలికారు. ప్రభుత్వం కొలువుదీరిన ఏడాదిలోనే మూడు లక్షల కోట్ల అప్పుచేసి రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశారని మండిపడ్డారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి.. జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని తెలిపారు.

జిల్లాలో ఈ సంస్కృతి ఎన్నడూ లేదు

జిల్లాలో తమ పార్టీ నేతలపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందని పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. జిల్లాలో ఈ తరహా దుష్ట సంస్కృతిని ఎన్నడూ చూడలేదన్నారు. ఒక్కొక్కరిపై పదుల సంఖ్యలో అక్రమ కేసులు పెడుతూ పీటీ వారెంట్లు జారీ చేస్తూ బెయిల్ రాకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. అరాచకాలను కప్పిపుచ్చుకునేందుకే ఇలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రసన్న ఇంటిపై 200 మంది టీడీపీ గూండాలు దాడి చేస్తే.. గుర్తుతెలియని వ్యక్తుల దాడంటూ పోలీసులు కేసు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. సీసీ ఫుటేజీని పరిశీలిస్తే దాడిలో పాల్గొంది ఎవరనేది స్పష్టంగా అర్థమవుతుందని, అన్ని ఆధారాలను అందజేసినా చర్యలు శూన్యమని విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి పోలీసులు, ఇంటెలిజెన్స్ వంతపాడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తున్నాయని మండిపడ్డారు. ఎన్ని అక్రమ కేసులు నమోదు చేసినా పార్టీ అండగా నిలిచి.. చట్టపరంగా పోరాటం చేస్తు ముందుకెళ్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు పందింటి కామరాజు, పోతరాజు చంద్రశేఖర్, సిద్ధిఖ్, దివ్యాంగ విభాగ జిల్లా అధ్యక్షుడు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టులు.. జైళ్లు సరిపోవు

- నవ్వారని, చప్పట్లు కొట్టారని కేసులు పెట్టడం హాస్యాస్పదం
- దమ్ముంటే రాజకీయంగానే ఎదుర్కోవాలే గానీ.. తప్పుడు కేసులు సరికాదు
- మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



విచారణ అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, నెల్లూరు: రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజం. రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టాలని ప్రతి విషయానికి కేసులు పెట్టుకుంటూ పోతే కోర్టు హాళ్లు, జైళ్లు సరిపోవని మాజీ మంత్రి నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రసన్నకుమార్‌రెడ్డిపై నమోదైన కేసులో శుక్రవారం నెల్లూరురూరల్ డీఎస్పీ కార్యాలయంలో ఆయన్ను విచారించారు. అనంతరం ఆయన ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆరోపణలపై స్పందించానే తప్ప తానెక్కడా ఆమెపై వ్యక్తిగత ఆరోపణలు చేయలేదన్నారు. నా వ్యాఖ్యలకు ద్వందార్థాలు తీశారని, అపార్థం చేసుకుని కేసులు పెట్టడం జరిగిందన్నారు. సమావేశంలో నాతోపాటు వేదిక మీద ఉన్న ఐదుగురు నవ్వారని, చప్పట్లు కొట్టారని వారిపైనా కేసులు పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇలాంటి చర్యలను ఇటీవల న్యాయమూర్తులు ఖండించారని గుర్తు చేశారు. నా ఇంటి మీద దాడి చేసిన వారి పేర్లతో సహా పోలీసులకు ఫిర్యాదు చేసినా.. వారం తర్వాత ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసినట్లు కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించామన్నారు. జిల్లా చరిత్రలో ఇళ్ల మీద దాడులు చేయడం ఇదే తొలిసారి అన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని తీసుకొచ్చి వైఎస్సార్‌సీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని కేసులు పెడుతున్నారన్నారు. అందరి మీద కేసులు పెడతాం, జైళ్లలో పెట్టిస్తాం అనుకుంటే.. రేపనేది ఒకటి ఉంటుందని గుర్తు పెట్టుకోవాలన్నారు. ఎల్లకాలం వీరు అధికారంలో ఉండరని, మళ్లీ మేము అధికారంలోకి వస్తాం. మాకు రెడ్‌బుక్ రాజ్యాంగం అవసరం లేదు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త నుంచి అధినాయకుడి వరకు మా బ్రెయిన్‌లోనే కంప్యూటర్ ఉంటుంది. ఎవరైతే ఇలాంటి పనులు చేస్తారో వారందరి సంగతి మేము అప్పుడు చూస్తామని ప్రసన్నకుమార్‌రెడ్డి హెచ్చరించారు.

మూడు గంటలు.. 40 ప్రశ్నలు

ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఫిర్యాదుతో కోవూరు పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసులో శుక్రవారం కోవూరు సర్కిల్ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని ఈ నెల 21వ తేదీన కోవూరు సీఐ వి. సుధాకర్‌రెడ్డి మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి 35 (3) బీఎన్ఎస్ఎస్ కింద నోటీసు జారీ చేశారు. కొన్ని కారణాలతో విచారణ స్థలాన్ని నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయానికి మార్చారు. దీంతో ప్రసన్నకుమార్‌రెడ్డి పలువురు వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి ఉదయం 10 గంటలకు మూలాపేటలోని నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. ప్రసన్నకుమార్‌రెడ్డి, ఆయన న్యాయవాదులను మాత్రమే పోలీసులు కార్యాలయంలోకి అనుమతిచ్చారు. రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు పర్యవేక్షణలో కోవూరు సీఐ వి. సుధాకర్‌రెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని విచారించారు. పోలీసులు అడిగిన 40 ప్రశ్నలకు ఆయన లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. మూడు గంటలపాటు విచారణ సాగింది. అప్పటికే కార్యాలయం బయట పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివచ్చి ప్రసన్నకుమార్‌రెడ్డికి సంఘీభావం ప్రకటించారు.

నా మాటల వెనుక దురుద్దేశం లేదు

బుచ్చిరెడ్డిపాళెంలో జరిగిన సమావేశంలో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి నాపై చేసిన ఆరోపణలకు నేను తిరిగి సమాధానమే చెప్పాను కానీ నా వ్యాఖ్యల్లో ఎలాంటి దురుద్దేశం లేదని ప్రసన్న పోలీసుల విచారణలో స్పష్టం చేశారు. న్యాయవాది చెంచురెడ్డి సమక్షంలో పోలీసులు అడిగిన 40 ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తనను వ్యక్తిగతంగా అవినీతిలో పీజీ చేశానని నిందారోపణలు చేసిందన్నారు. అందుకు సమాధానంగా రేణిగుంట, తిరుపతి, చెన్నై, బెంగళూరు, హైదరాబాదు, కాశీ, సూరత్, నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో చీరల వ్యాపారం బాగా అభివృద్ధి చేయడం వల్లే పీజీ చేసినట్లు మాట్లాడాను అన్నారు. అందులో ఎటువంటి ద్వందార్థాలకు తావులేదన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మహిళా అధ్యక్షులు, జనసేన, బీజేపీ నేతలతో తనపై వ్యక్తిగతంగా మాట్లాడించింది. నారా భువనేశ్వరి కూడా ఎక్స్‌లో ట్వీట్ చేసిందని, ప్రశాంతిరెడ్డి మాటలు విని పెట్టకుండా, రెండో వైపు కూడా వాస్తవాలు తెలుసుకుని పెట్టి ఉంటే బావుండేదని అనిపించిందన్నారు.

వెంకటశేషయ్య, నిరంజన్‌రెడ్డికి ముందస్తు బెయిల్

నెల్లూరు (లీగల్): వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, వెంకటాచలం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మందల వెంకటశేషయ్య, ఆ పార్టీ నేత అల్లం పాటి నిరంజన్‌రెడ్డిలకు కండీషన్లతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎల్.లక్ష్మణరావు శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. కనుపూరు చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలించి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారని వెంకటాచలం పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులో రెండో నిందుతుడిగా వెంకటశేషయ్య, మూడో నిందితుడిగా నిరంజన్‌రెడ్డి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో ముందస్తు బెయిలిచ్చింది. ఏపీ హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకొన్నారు. వెంకటశేషయ్య, నిరంజన్‌రెడ్డిల తరఫున సీనియర్ న్యాయవాదులు ఓ మనోహర్‌రెడ్డి, యు.రూపేష్ కుమార్‌రెడ్డి తమ వాదనలు వినిపించారు.

జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ సెక్రటరీకి విల్లింగ్ లెటర్

నెల్లూరు (టౌన్): జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ సెక్రటరీ నియామకం కోసం (2025–26, 27) రెండేళ్ల పాటు పని చేసేందుకు ఆసక్తిగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ (పీడీ, పీఈటీ) ఈ నెల 31వ తేదీలోపు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అవసరమైన ధ్రువపత్రాలతో విల్లింగ్ లెటర్ ఇవ్వాలని డీఈఓ ఆర్.బాలాజీ రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గైడ్‌లైన్స్, పారా మీటర్స్ కోసం deonellore50 webs. com వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

తల్లికి వందనం పడలేదయ్యా !



సమస్యలు తీర్చాలని మంత్రిని అడుగుతున్న మహిళలు

ఉలవపాడు: తల్లికి వందనం పడలేదయ్యా.. అంటూ మహిళలు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి కొలుసు పార్థసారథికి ఏకరువు పెట్టారు. శుక్రవారం మండలంలోని భీమవరంలో సుపరిపాలన – తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తల్లికి వందనం పడలేదని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన పలువురు మహిళలు మంత్రిని అడిగారు. సాంకేతిక సమస్యలను సరిచేసి అందరికి ఇస్తామని తెలిపారు. రేషన్ కార్డులు కావాలని, అంబేద్కర్‌నగర్‌లోని పాఠశాలను బాగు చేయాలని, సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ త్వరలో అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు హామీలు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇద్దరు బ్యాటరీ దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు

నెల్లూరు(క్రైమ్): చెత్త తరలించే వాహనాల బ్యాటరీలను దొంగతనం చేసి తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. నెల్లూరు సంతపేట పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఇన్‌స్పెక్టర్ జి.దశరథరామారావు వివరాలు వెల్లడించారు. పాత మున్సిపల్ కార్యాలయంలో చెత్త తరలించే వాహనాలను పార్క్ చేస్తారు. ఈ ఏడాది ఫిబ్రవరి మూడో తేదీన గుర్తు తెలియని దుండగులు 17 వాహనాల బ్యాటరీలను అపహరించారు. ఇంజినీరింగ్ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులు రంగనాయకులపేట రిక్షా కాలనీ ఆనకట్ట రోడ్డుకు చెందిన షేక్ షఫీ, నెల్లూరు రూరల్ మండలం అల్లీపురం టిడ్కో ఇళ్లలో ఉండే దాసరి అప్పారావుగా గుర్తించారు. గురువారం రాత్రి పుత్తా ఎస్టేట్ వద్ద వారిని అరెస్ట్ చేశారు. రూ.81 వేల విలువ చేసే 17 బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల అరెస్ట్‌లో ప్రతిభ చూపిన దశరథరామారావు, ఎస్సై సుల్తాన్‌బాషా, సిబ్బంది సుబ్బారావు, లావణ్య కుమార్, గోపీ, సురేంద్ర, అల్లాభక్షును ఏఎస్పీ సీహెచ్ సౌజన్య అభినందించారు.

మోకాళ్లపై కూర్చొని కార్మికుల నిరసన



నిరసన తెలియజేస్తున్న కార్మికులు, నేతలు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థలో కార్మికుల పనిని కాంట్రాక్టర్లకు అప్పజెబుతూ టెండర్లు పిలవడాన్ని నిరసిస్తూ చేస్తున్న సమ్మె పదో రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్మికులు శుక్రవారం నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్‌లో మోకాళ్లపై కూర్చొని 'మా కడుపులు కొట్టొద్దు.. పనులను కాంట్రాక్టర్లకు అప్పజెప్పొద్దు' అంటూ నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నెల్లూరు నగర గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, సీఐటీయూ నెల్లూరు రూరల్ ఉపాధ్యక్షుడు కొండా ప్రసాద్ మాట్లాడారు. మంత్రి నారాయణ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లగా కార్మికుల పనులను కాంట్రాక్టర్లకు అప్పజెప్పడం ప్రభుత్వ విధానమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టిన విధానంతో తాను చేసేది ఏమీ లేదని చెప్పారన్నారు. కార్మికుల కడుపులు కొట్టి కాంట్రాక్టర్ల జేబులు నింపే విధానాలను కూటమి ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కామాక్షమ్మ, సుజాతమ్మ, చంద్రమ్మ, భాగ్యమ్మ, కొండమ్మ, వజ్రమ్మ, భారతి, లోకేశ్, మనోజ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులను కాపాడి..

- గుండెపోటుతో స్టీరింగ్‌పై కుప్పకూలి డ్రైవర్ మృతి



రసూల్ (ఫైల్)

రాయచోటి టౌన్/కావలి(జలదంకి): బస్సు నడుపుతుండగా ఓ డ్రైవర్‌కు గుండెపోటు వచ్చింది. అప్రమత్తమై వాహనాన్ని నిలిపివేసి ప్రయాణికులను ప్రమాదం నుంచి తప్పించి స్టీరింగ్‌పైనే కుప్పకూలిపోయాడు. ట్రాఫిక్ పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. రసూల్ సాహెబ్ (52)ది నెల్లూరు జిల్లాలోని కావలి. స్థానిక డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నడుపుకొంటూ శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల సమయానికి అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటికి చేరుకున్నాడు. అక్కడి నుంచి బెంగళూరుకు వెళ్లే సమయంలో మార్గమధ్యలో మదనపల్లి రోడ్డు సమీపంలో అకస్మాత్తుగా గుండెలో నొప్పి రావడం ఆరంభమైంది. అప్రమత్తమైన రసూల్.. వెంటనే రాయచోటి పట్టణం సమీపంలోని ఓ డివైడర్‌కు బస్సు తగిలించి ఆపేశాడు. అనంతరం స్టీరింగ్‌పైనే కుప్పకూలిపోయాడు. ఆ సమయంలో కండక్టర్, మరో నలుగురికి ప్రమాదం తప్పింది. ప్రయాణికులు స్థానికుల సహకారంతో పోలీసులకు తెలియజేయడంతో ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి తన సిబ్బందితో వచ్చి డ్రైవర్ సీట్‌లో ఉన్న మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ సాగిస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 134
లేయర్ (లైవ్) : 112
బ్రాయిలర్ చికెన్ : 240
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 264
లేయర్ చికెన్ : 190

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.26
సన్నవి : రూ.15
పండ్లు : రూ.5

■ అనంతసాగరం మండలానికి చెందిన రమణయ్య అనే రైతు 8 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. యూరియా కోసం పడరాని పాట్లు పడ్డారు. సొసైటీలో దొరక్కపోవడంతో ప్రైవేట్ ఏజెన్సీల వద్ద బస్తా రూ.350కు కొనుగోలు చేశారు.

■ సంగం మండలం అన్నారెడ్డిపాళేనికి చెందిన శ్రీనివాసులు అనే రైతు అరున్నర ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. యూరియా కోసం బుచ్చిరెడ్డిపాళెం, సంగం, దువ్వూరు తదితర ప్రాంతాల్లో తిరిగి అలిసిపోయి ప్రైవేట్ ఏజెన్సీల వద్ద బస్తా రూ.380 పెట్టి కొన్నారు.

అవస్థలు పడుతున్న రైతులు

- రోడ్డెక్కి ఆందోళన చేస్తున్న వైనం
- 3.60 లక్షల ఎకరాల్లో వరి సాగు
- అనధికారికంగా మరో లక్ష ఎకరాల్లో..
- అధిక ధరలకు విక్రయిస్తున్న ప్రైవేట్ ఏజెన్సీలు

యూరియా కొరత.. రైతుల నరకయాతన

అన్నదాతలను యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి. అధికారులు చెబుతున్న మాటలకు క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతన ఉండటం లేదు. కొరత లేదని ఓవైపు అధికారులు చెబుతుంటే మరోవైపు సాక్షాత్తు అధికార పార్టీ ఎమ్మెల్యేలే రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇప్పటికే పలుచోట్ల యూరియా కోసం రోడ్డెక్కి ఆందోళనలు చేసిన సందర్భాలున్నాయి.



అనంతసాగరం మండలంలో యూరియా కోసం రైతుల అవస్థలు (ఫైల్)

నెల్లూరు(పొగతోట): జిల్లాలో వరిపంట సాగు చేస్తున్న రైతులు యూరియా కోసం యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాడు వైఎస్సార్‌సీపీ హయాంలో యూరియాను రైతు భరోసా కేంద్రాల ద్వారా సకాలంలో అందించారు. కానీ కూటమి ప్రభుత్వంలో ముందస్తు ప్రణాళిక లేదనే విమర్శలున్నాయి. సరిపడా నిల్వ చేయడంలో వైఫల్యం చెందింది. అధికారుల కాకిలెక్కల పుణ్యమా అంటూ రైతులు రోడ్డెక్కిన నిరసన కార్యక్రమాలు చేపట్టిన పరిస్థితులున్నాయి.

ఇదీ పరిస్థితి

జిల్లా వ్యాప్తంగా అధికారిక లెక్కల ప్రకారం 3.60 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. చెరువులు, కుంటల కింద అనధికారికంగా మరో లక్ష ఎకరాల్లో పంట సాగవుతోంది. ఐఏబీ సమావేశంలో 3.60 లక్షల ఎకరాలకు సాగునీరు విడుదల చేస్తున్నట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకటించారు. దానికి అనుగుణంగా వ్యవసాయ శాఖాధికారులు యూరియా, ఇతర ఎరువులను నిల్వ చేయాలి. కానీ నేడు యూరియా అందక రైతులు గగ్గోలు పెడుతున్నారు. సొసైటీలు, ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా యూరియా విక్రయాలు కొనసాగుతున్నాయి. ఐదు బస్తాలు కావాలంటే లిక్విడ్ యూరియాను తప్పనిసరిగా తీసుకోవాలని నిబంధన పెట్టారు. అయితే దానిపై పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో వ్యతిరేకిస్తున్నారు.

సరఫరా చేశామని చెబుతున్నా..

సొసైటీల్లో ఎమ్మార్పీ ధరలకే యూరియాను విక్రయిస్తున్నారు. కానీ అక్కడ ఆశించిన స్థాయిలో స్టాక్ లేదు. రైతు సేవా కేంద్రాల ద్వారా సరఫరా చేయడం లేదు. దీంతో ప్రైవేట్ ఏజెన్సీలు ఇష్టానుసారంగా అధిక ధర వసూలు చేస్తున్నాయి. దీని గురించి వ్యవసాయ శాఖాధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొరత నేపథ్యంలో రవాణా చార్జీలు తదితరాలను సాకుగా చూపి ఎక్కువ రేటు అమ్ముతున్నారు. కొందరు రైతులు అవసరానికి మించి నిల్వ చేసుకుంటున్నారని, అందువల్లే కొరత ఏర్పడుతోందని అధికారులు చెబుతున్న మాట. కాగా బుధవారం జరిగిన డీఆర్సీ సమావేశంలో కూటమికి చెందిన ఎమ్మెల్యేలే జిల్లా వ్యాప్తంగా యూరియా కొరతతో రైతులు ఆందోళన చేస్తున్నారన్నారు. అధిక ధరలకు అమ్ముతున్నా అధికారులు ఏం చేస్తున్నారని అడిగారు. మొదటిసారి రెండో పంటకు యూరియా కొరత వచ్చిందన్నారు. యూరియాను పూర్తిస్థాయిలో రైతులకు అందించేందుకు వ్యవసాయ శాఖాధికారులు ఎటువంటి ప్రత్యేక చర్యలు తీసుకోలేదు. అవసరానికి అనుగుణంగా సరఫరా చేస్తున్నామని కాకి లెక్కలు చెబుతున్నారు. వాస్తవ పరిస్థితులను కప్పిపుచ్చి క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో ఇలా..

డిమాండ్ ఎంతంటే.. : **47,588** మెట్రిక్ టన్నులు

ఇప్పటి వరకు సరఫరా చేసింది : **36,994.34** మెట్రిక్ టన్నులు

అందుబాటులో ఉంచాం

రైతుల అవసరాల నిమిత్తం సొసైటీలు, ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా యూరియాను సరఫరా చేశాం. మోతాదుకు మించి వినియోగించకూడదు. ఐఏబీ తీర్మానం ప్రకారం 3.60 లక్షలు, మరో 40 వేల ఎకరాలకు అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచాం. ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి. అధిక ధరలకు అమ్మేవారిపై చర్యలు తీసుకుంటాం. రైతులు ముందుకొచ్చి సమస్యలపై ఫిర్యాదు చేయాలి.

– సత్యవాణి, జిల్లా వ్యవసాయశాఖాధికారిణి

హామీలు నెరవేర్చాలని డిమాండ్

- నెల్లూరులో న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నెల్లూరు(లీగల్): 'జూనియర్ లాయర్లకు రూ.10 వేలు, సంక్షేమనిధికి రూ.100 కోట్లు, న్యాయవాదులకు ఇంటి స్థలం ఇస్తానని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా అవి హామీలుగానే మిగిలిపోయాయి. తక్షణమే వాటిని నెరవేర్చాలి' అని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఆరిగెల నాగేంద్రసాయి డిమాండ్ చేశారు. న్యాయవాదుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని జిల్లా కోర్టు ఆవరణలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం జూనియర్ న్యాయవాదులకు రూ.5 వేలు స్టైఫండ్, న్యాయవాదుల సంక్షేమ నిధికి రూ.25 కోట్లు ఇచ్చిందన్నారు. జిల్లా శాఖ జనరల్ సెక్రటరీ బ్రహ్మం మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం అమలులోకి తేవాలన్నారు. హైకోర్టు బెంచ్‌ని విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర బార్ కమిటీ న్యాయవాదులకు ఇస్తున్న డెత్ బెనిఫిట్ మొత్తాన్ని రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అయ్యప్పరెడ్డి, జాయింట్ సెక్రటరీ జేఎల్ నారాయణ, షేక్ యస్దానీ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ భూముల వివాదంపై సర్వే

సైదాపురం: మండలంలోని పొక్కందల గ్రామ సమీపంలో 95 సర్వే నంబర్‌లో ఉన్న వివాదాస్పదమైన మైనింగ్ భూములకు సంబంధించిన రికార్డులను శుక్రవారం జిల్లా సర్వేయర్ రఘురామరాజు, సైదాపురం ఇన్‌చార్జి సర్వేయర్ శ్రీనివాసులు పరిశీలించారు. గ్రామంలో సుమారు 200 ఎకరాల భూమి ఉంది. ప్రస్తుతం ముగ్గురు వ్యక్తులకు ఆ భూములకు సంబంధించిన లీజు ఉంది. ఇద్దరు మైనింగ్ యజమానుల మధ్య భూ వివాదం ఏర్పడింది. తమ భూములను ఓ యజమాని ఆక్రమించారంటూ ఒకరు ఉన్నతాధికారులతోపాటు కోర్టును కూడా ఆశ్రయించారు. దీంతో అధికారులు రికార్డులతోపాటు హద్దులను పరిశీలించారు.

చెలరేగిపోతున్న తమ్ముళ్లు

- తరలిపోతున్న గ్రావెల్
- కరుగుతున్న గొల్లకందుకూరు తిప్ప



గ్రావెల్ తవ్వకాలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: తెలుగు తమ్ముళ్లు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారు. కొండలు, గుట్టలను కరిగిస్తూ యథేచ్ఛగా అమ్మకాలు సాగించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తాజాగా పొదలకూరు మండలం తాటిపర్తి పంచాయతీ సమీపంలో ఉన్న గొల్లకందుకూరు తిప్పను కరిగిస్తున్నారు. రెండు రోజులుగా రేయింబవళ్లు యంత్రాలతో కొండను తవ్వేస్తూ నెల్లూరుకు గ్రావెల్‌ను తరలిస్తున్నారు. గతంలో పొదలకూరు లేఅవుట్లకు తరలించిన అక్రమార్కులు కొంతకాలం నిలిపివేశారు. తిరిగి నెల్లూరుకు గ్రావెల్ తరలింపు చేపట్టారు. మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు అటు వెళ్లేందుకు కూడా ఇబ్బంది పడుతున్నారు. ముందుగా నెల్లూరు శివారు ప్రాంతాల్లో వేసే లేఅవుట్ల యజమానులతో మాట్లాడుకున్నారు. గ్రావెల్ తవ్వి టిప్పర్లకు లోడ్ చేసినందుకు ట్రిప్పునకు రూ.4 వేలు వంతున కమీషన్‌ను తమ్ముళ్లు తీసుకుంటున్నారని ఆరోపణలున్నాయి. ఇదే పంచాయతీలో ఇటీవల నెలరోజులపాటు అక్రమంగా గ్రావెల్‌ను తరలించి సొమ్ము చేసుకున్నారు.

దౌర్జన్యంగా రోడ్డు వేస్తున్నారని నిరసన

- బాధితుడిని లాక్కెళ్లిన పోలీసులు



భాస్కర్‌ను లాక్కెళ్తున్న పోలీస్ బలగాలు

సీతారామపురం: పరిహారం చెల్లించకుండానే దౌర్జన్యంగా తన భూమిలో రోడ్డు పనులు చేపట్టారని మండలంలోని గుండుపల్లికి చెందిన మామిడి భాస్కర్ అనే వ్యక్తి వాపోయాడు. అతను శుక్రవారం గ్రామంలో జాతీయ రహదారి నిర్మాణ పనుల వద్ద కుటుంబ సభ్యులతో కలిసి నిరసన తెలిపి మాట్లాడుతూ తనకు వారసత్వంగా వచ్చిన భూమిలో 50 సెంట్లు హైవేకు పోతుందన్నారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో నష్టపరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు బలగాలను దింపి నేషనల్ హైవే పనులను చేపట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ విషయంపై తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి, కాంట్రాక్టర్ మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ అతని దాయాదులు కోర్టును ఆశ్రయించడంతో నష్టపరిహారం చెల్లించేందుకు అంతరాయం ఏర్పడిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో నిర్మాణ పనులు చేయించడం జరిగిందన్నారు. కాగా ఒకానొక దశలో పరిస్థితి చేయి దాటిపోవడంతో భాస్కర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

బ్యాంక్ ఉద్యోగులకు నోటీసులు

నెల్లూరు(క్రైమ్): రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేకెత్తించిన యాక్సిస్ బ్యాంక్‌లో రుణాల కుంభకోణంపై పోలీసులు విచారణ వేగవంతం చేశారు. 8 నెలల క్రితం ముత్తుకూరు పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. వారు పలుమార్లు రుణాలకు సంబంధించిన రికార్డులను అందజేయాలని బ్యాంక్ అధికారులను కోరారు. స్పందన లేకపోవడంతో గురువారం సాయంత్రం నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లోపు మొత్తం ఫైళ్లను అందజేయాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

5 కేజీల గంజాయి స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీధర్

నెల్లూరు(క్రైమ్): గంజాయిని తరలిస్తున్న ఓ వ్యక్తిని రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. రైల్వే డీఎస్పీ జి.మురళీధర్ తన కార్యాలయంలో నిందితుడి వివరాలను వెల్లడించారు. శుక్రవారం నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. టాటానగర్ – ఎర్నాకుళం జంక్షన్ వెళ్లే రైలు నుంచి దిగి ప్లాట్‌ఫారంపై అనుమానాస్పదంగా ఉన్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన వి.మనోజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని బ్యాగ్‌లోని 5 కేజీల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని రైల్వే ఎస్సై ఎన్.హరిచందన కేసు నమోదు చేశారు. సమావేశంలో నెల్లూరు సీఐ ఎ.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి కాలువలో మృతదేహం



నెల్లూరు(క్రైమ్): నెల్లూరు మినీబైపాస్ రోడ్డులోని పూలేబొమ్మ సమీపంలో కారు స్టాండ్ వెనుక సర్వేపల్లి కాలువలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చింది. స్థానికులు ఈ విషయాన్ని వీఆర్వో సుబ్బులక్ష్మమ్మ తెలియజేశారు. ఆమె బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి వయసు 48 నుంచి 50 ఏళ్లలోపు ఉండొచ్చని భావిస్తున్నారు. గులాబీ రంగు చొక్కా, సిమెంట్ రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు తెలియజేయాలని ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు తెలిపారు. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడ్డాడా? ఆత్మహత్య చేసుకున్నాడా? మరే ఇతర కారణం ఏమైనా ఉందా అని ఆరా తీస్తున్నారు.

విద్యార్థిని చితకబాదిన ప్రైవేట్ టీచర్



కలువాయి (సైదాపురం): ఓ బాలుడిని ఓ ప్రైవేట్ టీచర్ చితకబాదింది. బాధితుల కథనం మేరకు.. కలువాయిలోని ఓ ప్రైవేట్ స్కూల్లో యూకేజీ చదువుతున్న వీర సంతవిష్ణను శుక్రవారం టీచర్ శ్రావణి చితకబాదింది. సాయంత్రం సోమశిలలోని ఇంటికి చేరుకున్న బాలుడికి తల్లి స్నానం చేయిస్తుండగా శరీరంపై దెబ్బల్ని చూసి జరిగిన విషయాన్ని తెలుసుకుంది. ఆమె తన భర్త వరప్రసాద్‌కు వివరించింది. కుటుంబ సభ్యులు కలువాయి పోలీసుస్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు.